www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 6 ఆగస్టు 2024



కలెక్టరేట్‌లో 150 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 150 అర్జీలు స్వీకరించామని ఇన్‌ఛార్జి జెసి జి.నరసింహులు తెలిపారు. సోమవారం కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణానాయక్, టూరిజం ఆర్‌డి వి.స్వామినాయక్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ టి.రాధికలతో కలిసి అర్జీలు స్వీకరించామని తెలిపారు. రెవెన్యూకు 42, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధికి 26, హోమ్‌కు 25, వైద్య ఆరోగ్య 16, మున్సిపాలిటీకి సంబంధించి 10, ఇతర శాఖలకు సంబంధించి 41 అర్జీలు స్వీకరించామన్నారు. వీటిలో 139 ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. 11 అర్జీలు ఆఫ్ లైన్‌లో నమోదు చేశామన్నారు ధవళేశ్వరానికి చెందిన పల్నాటి పార్వతిదేవి ప్రస్తుతం ఇస్తున్న దివ్యాంగ పెన్షన్ మొత్తాన్ని రూ.6 వేల నుంచి రూ.15 వేల కేటగిరిగా మార్పు కోసం అర్జీ ఇచ్చారన్నారు.

కదం తొక్కిన స్కీం వర్కర్లు

- వేధింపులు, తొలగింపులపై ధర్నా
- నినాదాలతో హోరెత్తిన కలెక్టరేట్



నిరసనలో పాల్గొన్న స్కీం వర్కర్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వేధింపులు, అక్రమ తొలగింపులకు నిరసనగా జిల్లాలోని స్కీమ్ వర్కర్లు కదం తొక్కారు. కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగారు. మండుటెండలోనే రోడ్డుపై బైటాయించారు. వేధింపులు ఆపాలని, అక్రమ తొలగింపులను అరికట్టాలని, ఉద్యోగ భద్రత కల్పించాలనే తదితర డిమాండ్లతో కలెక్టరేట్ దద్దరిల్లింది.

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంలచి స్కీం వర్కర్లు చిరుద్యోగులపై జరుగుతున్న రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు తక్షణం నిలుపుదల చేయాలని, ఏ ఒక్క ఉద్యోగినీ తొలగించరాదని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం రూరల్‌లోని కలెక్టరేట్ వద్ద సోమవారం బొమ్మూరు కలెక్టరేట్ వద్ద స్కీమ్ వర్కర్లు ధర్నా చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నేటి వరకు రాష్ట్రంలో అనేక జిల్లాల్లో వివిధ రంగాల కార్మికులను అక్రమంగా తొలగిస్తున్నారన్నారు. ఇవన్నీ రాజకీయ అక్రమ తొలగింపులేనన్నారు. దీనికి చట్టబద్ధత లేదని, స్థానిక గ్రామ పెద్దలు కక్షలతో తొలగిస్తు కొత్తవారిని నియమించుకుంటూ రూ.లక్షలో డబ్బులు దండుకోవాలన్నది కొందరి నాయకుల ప్రయత్నం అన్నారు. అరకొర వేతనాలతో ప్రభుత్వ శాఖల్లో అనేకేళ్లుగా పనిచేస్తున్నారన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించకుండా వారిని వేధింపులకు గురి చేయడం, బలవంతంగా తొలగించడం దారుణమన్నారు. వీటిని తీవ్రంగా ఖండించారు. ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ఇలాగే వ్యవహరించడం వల్ల నేడు ఆ పార్టీ ఎంఎల్‌ఎలు ఇంటికే పరిమితమయ్యారన్నారు. నూతన ప్రభుత్వం ఉద్ధరిస్తుందని ఆశలు పెట్టుకుంటే మొత్తానికి బయటికి గెంటివేస్తున్నారన్నారు. ఉద్యోగులు రాజకీయ పార్టీల నాయకులు కాదన్నారు. విధి విధానాలతో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్నారని, ఐదేళ్లకు ఒకసారి నాయకులు మారినట్టుగా కార్మికులను మార్చడం చట్టబద్ధత కాదని హెచ్చరించారు. సంబంధిత శాఖ అధికారులు అక్రమ తొలగింపులు, వేధింపులపై మౌనంగా ఉండడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్.మూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి పూర్ణిమరాజు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్, సిఐటియు జిల్లా నాయకులు పి.తులసి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.మాణిక్యాంబ, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.బేబీరాణి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.వెంకటలక్ష్మి, ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ నాయకులు చిట్టా బేబి, ఎపి వెలుగు యానిమేటర్స్ యూనియన్ నాయకులు ప్రమీల, ఎపి ఫీల్డ్ అసిస్టెంట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.ప్రకాష్ తదితరులు మాట్లాడారు. పెద్ద సంఖ్యలో వివిధ రంగాల నుండి చిరు ఉద్యోగులు, స్కీం వర్కర్లు పాల్గొన్నారు.


మండుటెండను లెక్కచేయక...


స్కీమ్ వర్కర్ల నాయకులు



వర్చువల్‌లో పాల్గొన్న అధికారులు

విజన్-2047పై కలెక్టర్లకు సిఎం దిశానిర్దేశం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పరిపాలన విధానంలో రాష్ట్ర ప్రభుత్వం విజన్-2047పై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరభ్‌కుమార్‌ప్రసాద్, సిసిఎల్ఎ జి.జయలక్ష్మి ప్రారంభ సందేశం ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్ మాట్లాడారు. స్థానిక కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వర్చువల్ ద్వారా నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ కేతన్‌కార్గ్, ఇన్‌ఛార్జి జెసి, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక రంగం, వ్యవసాయ అనుబంధ రంగాలు, ఖనిజ సంపద, సహజ వనరులపై, సెకండరీ సెక్టార్, మౌలిక సదుపాయాలపై, మానవ వనరులు, సామాజిక రంగం, సంక్షేమం, వైద్య ఆరోగ్య రంగం పట్టణ మరియు గ్రామీణ అభివృద్ధి, సేవా రంగం, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల పనితీరుపై, తదుపరి శాంతి భద్రతలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర స్థాయి అధికారులు ప్రణాళికలను వివరించారు.

కంటి చూపుపై శ్రద్ధ అవసరం

రాజమండ్రి కేంద్ర కారాగార పర్యవేక్షణాధికారి రాహుల్


ఖైదీలకు కళ్లజోళ్లను తొడుగుతున్న జైలు సూపరింటెండెంట్ రాహుల్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కంటి చూపు భద్రత, ఆరోగ్యం పట్ల అందరూ శ్రద్ధ వహించాలని రాజమండ్రి కేంద్ర కారాగార పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ అన్నారు. కారాగారంలో సోమవారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం 210 మంది ఖైదీలకు కళ్లజోళ్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలకు పరీక్షలు చేయడానికి ముందుకొచ్చిన వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం యాజమాన్యానికి, కళ్లజోళ్లు అందించిన ఆమెన్ స్వచ్ఛంద సంస్థకి కృతజ్ఞతలు తెలిపారు. కళ్లజోళ్లను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప పర్యవేక్షణాధికారులు ఎం.రాజకుమార్, బి.రత్నరాజు మాట్లాడుతూ ఖైదీలు ఆరోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉంటూ జైల్లో ఉన్న ఆస్పత్రి సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఖైదీల మెరుగైన ఆరోగ్యం కోసం నిరంతరం రక్త పరీక్షలు చేసి తగిన వైద్య సేవలు కూడా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ జైలర్ శ్రీనివాసరావు, వైద్యాధికారిణి కోమల ఇతర జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో రక్తదాన శిబిరం

రాజమహేంద్రవరం: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో రెడ్ క్రాస్, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇండియన్ బ్యాంక్ 118వ ఫౌండేషన్ కార్యక్రమం సందర్భంగా కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ పిఎస్ఎస్.సుధాకర్‌రావు రక్తదానం ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కొన్ని డస్ట్ బిన్స్‌ను కళాశాలకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ లాలాచెరువు బ్రాంచ్ మేనేజర్ కె.మౌని, ఎన్‌సిసి సమన్వయకర్త లెఫ్టినెంట్ బాషా, ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త డాక్టర్ బి.మల్లికార్జున, రెడ్ క్రాస్ సమన్వయకర్త జి.రవితేజ, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, పిఆర్ఓ, సమన్వయ కర్త డాక్టర్ జె.సురేష్ పాల్గొన్నారు .

8న పేరెంట్స్ కమిటీ ఎన్నిక

చాగల్లు : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 8న పేరెంట్స్ కమిటీ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ యు.గురునాథం తెలిపారు. ఈనెల 1న ఎలక్షన్ నోటిఫికేషన్, ఓటర్ లిస్ట్ అందజేశామన్నారు. 5న ఆయా పాఠశాలలో అభ్యంతరాలు సేకరణ, 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ ఎలక్షన్ నిర్వహిస్తామన్నారు. అదేరోజు రెండు గంటలకు కొత్త కమిటీ ప్రమాణ స్వీకారం, అనంతరం నూతన కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం మొత్తం 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక యుపి స్కూలు, 31 ప్రైమరీ స్కూల్లో మొత్తం 39 స్కూల్లో ఓటర్ల 3,251 మంది పాల్గొంటారని ఆయన తెలిపారు


కార్టూ'నిజం'



గోదారీ గట్టుందీ... గట్టు మీన చెట్టు లేదు...

సోమవారం కూలిన 150 ఏళ్ల నాటి వృక్షం

300 చిత్రాల్లో కనిపించిన 'సినిమా చెట్టు'


కూలక ముందు


కూలిన వృక్షం

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

గోదారీ గట్టుందీ.. గట్టుమీన చెట్టుందీ... అనే పాట వింటే అందరి మనస్సు ఇప్పటికీ పులకరిస్తుంది. గోదారి.. ఆ చెట్టు కళ్ల ముందు కదలాడతాయి. గోదావరి గట్టు అయితే ఉంది గాని.. నేడు ఆ చెట్టు కనుమరుగైంది. 300 చిత్రాలకు పైగా చిత్రీకరణలు జరిగిన చెట్టు సోమవారం తెల్లవారు జామున కూలిపోయింది. ఈ 'సినిమా చెట్టు' నేలవాలడంతో ప్రకృతి ప్రేమికులతో పాటూ సినీప్రేమికుల్లో విచారం నెలకొంది.

కొవ్వూరు మండలం కుమార దేవం గ్రామంలో సింగూలూరి తాతయ్య అనే వ్యక్తి బూరుగు మొక్కను నాటాడు. అక్రమంగా పెరిగి మహావృక్షంగా మారింది. 150 ఏళ్లనాటి ఈ చెట్టు సోమవారం ఒక్కసారిగా కూలిపోయింది. 1960లో జమున ప్రధానపాత్రగా నటించిన తోడికోడళ్ళు సినిమా షూటింగ్ ఇక్కడే జరిగింది. 'గోదారి గట్టుంది, గట్టుమీన చెట్టుంది' అనే పాటను ఇక్కడే చిత్రీకరించారు. అనంతరం క్రమంగా ఇక్కడ షూటింగులు నిర్వహించడం ప్రారంభించారు. ఈ చెట్టు వద్ద చిత్రీకరణ చేస్తే సినిమా హిట్ అనే టాక్ కూడా ఉండటంతో సినిమావాళ్లకు ఇది సెంటిమెంట్‌గా మారింది. నాటి సినిమాల్లో ఒక్క సీను అయినా ఈ చెట్టు వద్ద చిత్రీకరించేవారు. ఇలా 300లకు పైగా సినిమాల్లో ఈ చెట్టు తన పాత్రను పోషించింది. ఈ చెట్టు వల్లే కుమారదేవం గ్రామానికి ఎంతో గుర్తింపు కూడా వచ్చిందని స్థానికులు చెబుతుంటారు. ఈ చెట్టు ఒక్కసారిగా కూలిపోవడం పట్ల వారు విచారం వ్యక్తం చేస్తున్నారు. గోదావరి కోత, వర్షాల కారణంగా చెట్టు కూలిపోయిందని వారు చెబుతున్నారు. దీని సంరక్షణకు పలుమార్లు వినతులు అందించినా అధికారులు, పాలకులు స్పందించలేదని, పర్యవేక్షణను గాలికివదిలేయడం వల్లే నేడు దీన్ని కోల్పోయామని స్థానికులు చెబుతున్నారు.

బల్క్ వేస్ట్‌ను కంపోస్టుగా మార్చుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పెద్ద మొత్తంలో చెత్త వచ్చే అవకాశమున్న అపార్టుమెంట్ల వారు, పెద్ద హోటళ్లు, ఇతర వినియోగదారులు సొంతంగా కంపోస్టును తయారు చేసుకోవాలని కమిషనర్ కేతన్‌గార్గ్ పిలుపునిచ్చారు. ప్రతి రోజూ నిర్వహించే నగర పర్యటనలో భాగంగా సోమవారం వెంకటేశ్వరనగర్, విద్యుత్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అపార్టుమెంట్ల వారితో మాట్లాడారు. షెల్టాన్ హోటల్‌లో నిర్వహిస్తున్న కంపోస్టు తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అపార్టుమెంట్ల వారు ప్రతి రోజూ తమ వద్ద ఉన్న చెత్తను కంపోస్టుగా తయారు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శానిటేషన్ సెక్రటరీలు తమ పరిధిలోని పెద్ద మొత్తంలో చెత్త ఉత్పత్తి చేసే వారందరినీ కలిసి వారంతట వారే కంపోస్టు తయారు చేసుకోనేలా తగిన సూచనలు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి రోజూ శానిటేషన్ సెక్రటరీలు ఫీల్డ్ విజిట్ నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన 18వ సచివాలయ శానిటరీ సెక్రటరీకి షోకాజు నోటీసు జారీ చేయాలని హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎ.వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.


జివికి బర్త్‌డే కేక్‌ను తినిపిస్తున్న నాయకులు

ఘనంగా జివి పుట్టినరోజు

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రముఖ పారిశ్రామికవేత్త, టిడిపి నాయకుడు అన్నదేవరపేట గ్రామానికి చెందిన గొరిజాల వెంకటప్రసాద్(జివి) పుట్టిన రోజు సోమవారం ఆయన స్వగ్రామంలో కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కూటమి నాయకుల సమక్షంలో ఘనంగా జరిగాయి. కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు కమిటీ నాయకులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, యువ నాయకులు అల్లూరి విక్రమాదిత్య జనసేన నాయకులు టివి.రామారావు, సొసైటీ అధ్యక్షులు మద్దిపట్ల శివరామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గజ్జరం గ్రామానికి చెందిన కొర్లపాటి దత్తుడు జివిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పుట్టిన రోజు కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నామన పరమేశ్వరరావు, కొటారు వెంకట్రావు, యువగళం జిల్లా నాయకులు కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, తొండెపు భరత్‌లతో పాటు నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోపాలపురంలో వాహన తనిఖీలు

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురంలో పోలీసులు వాహన తనిఖీలను సోమవారం నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, హెల్మెట్లు, రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, రికార్డు లేని వాహనాలు ఎనిమిది, నెంబర్ ప్లేటు లేని వాహనాలు, హెల్మెట్ లేని వాహనాలు గుర్తించామన్నారు. నెంబర్ ప్లేట్లు లేని వాహనాలకు నెంబర్ ప్లేట్లు అమర్పించామన్నారు.. 41 వాహనాలకు అపరాధ రుసుం కింద రూ.5,500 వేశామని తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదానికి సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి సామాజిక విశ్లేషకులు, మోటివేషనల్ స్పీకర్ సుంకవల్లి సత్తిరాజు రూ.3వే ఆర్థిక సాయం అందించారు. ఈ ససందర్భంగా ఆయన మాట్లాడారు. మనకు అల్పమైనది, వేరొకరికి అత్యంత విలువైనది కావొచ్చన్నారు. మనమిచ్చే స్వల్పమైన ద్రవ్యం ఆపదలో ఉన్నవారికి కొండంత అండ నిస్తుందన్నారు. అగ్నికి ఆజ్యం తోడైనట్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు ఇంట్లోని గ్యాస్ సిలిండర్లు పేలడం వలన సర్వం కోల్పోయి, అనాథలుగా మిగిలిన యర్నగూడెం లోని ఈ రెండు కుటుంబాలకు అండగా నిలిచిన వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కేరళ లోని వయనాడ్ ప్రకృతి విధ్వంసంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళ మందించినట్టు సుంకవల్లి సత్తిరాజు తెలిపారు.

ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ తిలక్‌కు అభినందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇగా బాధ్యతలు స్వీకరించిన కె.తిలక్‌కుమార్‌ను జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు గొట్టిముక్కల అనంతరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అనంతరావు పలు వినియోగదారుల సమస్యలు ఎస్ఇ దృష్టికి తీసుకువెళ్లారు. మీటర్ రీడింగ్‌ను కచ్చితంగా నెల రోజులకు తీసేవిధంగా చర్యలు చేపట్టాలని, విద్యుత్ పంపిణీ వ్యవస్థలో మితిమీరిన లంచాలు అరికట్టాలని కోరారు. ఎప్పటినుంచో పాతుకుపోయిన ఉద్యోగులను బదిలీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఇ తిలక్ మాట్లాడుతూ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారులకు మరింత చేరువగా ఉంటుందన్నారు. ఏవైనా ఫిర్యాదులుంటే తన దృష్టికి తీసుకువస్తే చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఎస్ఇను శాలువా, పూల మొక్కతో అనంతరావు, సీనియర్ జర్నలిస్ట్ పల్లి శ్రీను అభినందించారు.



7న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

'చలో ఢిల్లీ'కి మద్దతుగా ఈ నెల 7న కలెక్టరేట్ వద్ద ధర్నా జరుగుతుందని దీన్ని విజయవంతం చేయాలని ఇపిఎస్ పెన్షన్లకు నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఇపిఎస్-95 పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ సిహెచ్.మోహన్‌రావు మాట్లాడుతూ అసోసియేషన్ యానివర్సరీ డే, ఫ్రెండ్‌షిప్‌డే సందర్భంగా పెన్షనర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత నూతన కేంద్ర ప్రభుత్వం వచ్చిన సందర్భంగా మన సమస్యలపై ఢిల్లీలో జరుగుతున్న కార్యక్రమానికి జిల్లా నుంచి ఐదుగురు సభ్యులను పంపించామన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్థికంగా సహకరించిన హార్లిక్స్ ఫ్యాక్టరీ వర్కర్స్‌కు, ఆర్‌టిసితరుపున కెవి.రావుకు, ఎపిపిఎం తరపున సోమేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో సమావేశంలో ఎస్.రామకృష్ణారెడ్డి, గురువులు, టిఎస్.ప్రభాకర్‌రావు, కెఎస్‌వి.రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

ప్రజాశక్తి - గోపాలపురం



గోపాలపురం శివారులో గల తాడిపూడి కాలువ వంతెనకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న స్లాబ్ కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. స్థానిక గోపాలపురం నుంచి వాదాలకుంటకు వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డు మార్గంలో తాడిపూడి లిఫ్టు -2, డి-2 కాలువ వంతెన ఉంది. గోపాలపురం నుంచి ఆర్అండ్‌బి రోడ్‌లో ఉన్న ఈ వంతెన మీదుగా యాదవోలు, నిడదవోలు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఆ కల్వర్టు వంతెన స్లాబ్ సుమారు అడుగుపైగా కుంగిపోయింది. గుంతలా తయారై ప్రమాదకరంగా మారింది. భారీ వాహనాలు వెళ్తే కల్వర్లు కూలిపోయే ప్రమాదం కూడా ఉంది. ఎటువంటి ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం పంచాయతీ పరిధిలోని రాజు చెరువు భూములు నీట మునిగాయని తక్షణం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకుడు చింతల రామకృష్ణ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వీరలంకపల్లి సమీపంలో ఉన్న రాజు చెరువుకి ఎగువ ప్రాంతంలో ఉన్న భూములు చెరువు నీరు పోటు ఎత్తడంతో పూర్తి స్థాయిలో మునిగిపోయాయని తెలిపారు. ప్రత్యామ్నాయంగా కాలువ అడ్డుగా ఉన్న బల్లలు తాత్కాలికంగా తొలగించి కొంత నీరు తగ్గిన తర్వాత మళ్లీ ఏర్పాటు చేసే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు.

మూడు అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - గోపాలపురం

సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మూడు అర్జీలు స్వీకరించామని ఎంపిడిఒ కె.రమేష్ తెలిపారు. గుడ్డిగూడెం గ్రామంలో పాఠశాల ఆవరణను అనుకొని బెల్ట్ షాపు ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, దీన్ని తొలగించాలని రెండు అర్జీలు వచ్చాయన్నారు. భూమి ఆక్రమణకు సంబంధించి వేలచింతలగూడెం గ్రామానికి చెందిన బాధితుడు అర్జీ ఇచ్చాడని తెలిపారు.

నేడు పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - పెరవలి

మండలం కానూరు విద్యుత్ కేంద్రంలో మరమ్మతుల కారణంగా మంగళవారం కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, నడుపల్లి, తీపర్రు, కాకరపర్రు తదితర గ్రామాలకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తామని ఇఇ బి.వీరభద్రరావు, ఎఇ డేవిడ్‌నిశ్చల్ తెలిపారు. వ్యవసాయానికిఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు మధ్యాహ్నం 4 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మార్చినట్టు తెలిపారు.

నేరాలు ఘోరాలు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - గండేపల్లి

యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. గతనెల 22వ తేదీన మండలంలోని యల్లమిల్లి గ్రామానికి చెందిన తవిటికి మానస అమలాపురంలో పరీక్ష రాయడానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదని, ఆమె ఆచూకీ కోసం ఎంతగా వెతికినా కన్పించలేకపోవడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. ఆ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

కట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి - వాగల్లు

అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు భర్తపై భార్య ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. గత 20 ఏళ్ల క్రితం బ్రాహ్మణ గూడెం గ్రామానికి చెందిన చౌదరి అంకంనాయుడుతో చౌదరి ఆరుద్ర ఇచ్చి వివాహం చేశారు. అప్పటి నుంచి తన అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, అలాగే తన భర్త అంకం నాయుడు చెడు అలవాట్లకు బానిసై తనను వేధిస్తున్నట్లు ఆరుద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆరుద్రకు 13 సంవత్సరాల కుమారుడు ఉన్నట్లు ఆయన తెలిపారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఇఒ

దంతాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - పెదపూడి

దంతాల సంరక్షణపై అందరు అవగాహన పెంచుకుని జాగ్రత్తలు పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంఇఒ-2 సివివి.సత్యనారాయణ అన్నారు. పెదపూడి, కైకవోలు, కరకుదురు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతి విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కాకినాడ అధ్యక్షుడు డాక్టర్ కోరా నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిన్న వయస్సులోనే దంతాల సంరక్షణపై వైద్యుల సూచనలు సలహాలు పాటించి దంతాలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదపూడి, కైకవోలు హెచ్ఎంలు కె. సత్యనారాయణ, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

మత్స్యకారులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - యానాం

యానాం మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారులకు అవగాహన నిర్వహించారు. సోమవారం స్థానిక మత్స్యకార గ్రామమైన సావిత్రి నగర్, గిరియాంపేట గ్రామంలో పిఎంఎంఎస్‌వై పథకం కింద మత్స్యకారుల నైపుణ్య అభివృద్ధి శిక్షణలో భాగంగా బోట్ ఇంజిన్ లోపాన్ని సరిదిద్దడం, వాటి నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఎ మునిస్వామి పాల్గొని మాట్లాడారు. మత్స్యశాఖ అధికారి డి గోవిందు మాట్లాడుతూ మూడు రోజులపాటు ఈ శిక్షణలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నంకు చెందిన సిఐఎఫ్ఎన్ఇటి అధికారులు వి.వి. పూజార్, హరినాథ్, అర్జున్, ఆయా గ్రామాల మత్స్యకారులు పాల్గొన్నారు.

7న తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట వాటర్ వర్క్స్‌లో నిర్వహణ, ఫిల్టర్ బెడ్స్ మరమ్మతులు పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 7వ తేదీ సాయంత్రం కనకాలపేట, గణపతి నగర్, యుకెవి నగర్, భీమ్ నగర్, పెద్దిరెడ్డి గార్డెన్స్, కోన గార్డెన్స్, ఫ్రాన్స్ తిప్ప ఏరియాలలో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజా పనుల శాఖ అసిస్టెంట్ ఇంజనీరు కాళ్ళ నాగరాజు సోమవారం ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు నీటిని ముందుగానే నిల్వ చేసుకోవాలని కోరారు. నీటిని వృధా చేయరాదని సూచించారు.

'దోని గంగమ్మ' కథకు నగదు బహుమతి

ప్రజాశక్తి - యానాం

తటవర్తి భారతి స్మారక ప్రపంచ స్థాయి కథల పోటీలో యానాంకు చెందిన కథకుడు రత్నాకర్ పెనుమాక రాసిన కథ రూ.10 వేలు నగదు బహుమతికి ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన ఈ కథా పోటీలకు కథా రచయితగా రాణిస్తున్న రత్నాకర్ పెనుమాక 'దోని గంగమ్మ' అనే కథను పంపించారు. ఈ మేరకు తన కథ నగదు బహుమతికి ఎంపికైనట్టు కథల పోటీల నిర్వాహకులు నుంచి సమాచారం అందినట్టు రత్నాకర్ సోమవారం తెలిపారు. ఈ పోటీలకు ప్రొఫెసర్ సి.హెచ్.సుశీలమ్మ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ పోటీలో రత్నాకర్‌తోపాటు పలువురు కథకులు ఆయా స్థాయిల్లో నగదు బహుమతులకు ఎంపికయ్యారు. రత్నాకర్ త్వరలో నిర్వహించే సభలో బహుమతిని అందించి, సత్కరించనున్నారు. ఇప్పటికే ఒక కథా సంపుటి వెలవరించిన రత్నాకర్ కథకుడుగా గతంలో కూడా పలు అవార్డులు, బహుమతులు పొందారు. కథా రచనలో అత్యంత ప్రతిభ కనబరుస్తున్న రత్నాకర్‌కు పలువురు అభినందనలు తెలిపారు.



గుంతలతో రెవెన్యూ కార్యాలయ ఆవరణ

'రెవెన్యూ' ముంగిట నీటి గుంతలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల రెవెన్యూ కార్యాలయం ముంగిట నీటి గుంతలతో అటు అధికారులు, సిబ్బంది, ఇటు ప్రజలు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. రెవెన్యూ కార్యాలయం కాంప్లెక్స్‌లో సబ్ ట్రెజరీ, ఎస్‌సి డివిజన్, హౌసింగ్, ఐసిడిఎస్, డ్వామా, స్త్రీశక్తి కార్యాలయాలు ఉన్నాయి. ప్రతీరోజు ఆయా కార్యాలయాలకు మండలంలోని 23 గ్రామాల నుంచి వందలాదిగా ప్రజలు వచ్చి వెళ్లే పరిస్థితి ఉందికీ కార్యాలయాల ముంగిట చెరువులను తలపించేలా గుంతలు ఉండటంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే నీటి గుంతలకు మర్మతులు చేపట్టేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి - సామర్లకోట

జెడ్‌పి పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని నెస్లె ఇండియా కార్పొరేట్ ఎఫైర్స్ మేనేజర్ వసీమ్ అహ్మద్ అన్నారు. సోమవారం నెస్లె ఇండియా సిఆర్‌సి నిధులతో నిర్మించిన మరుగుదొడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం యు.మీనా మాధురి మాట్లాడుతూ పాఠశాలలో 550 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలతోపాటు, కళాశాల విద్యార్థులకు మరో యూనిట్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఆయన మాట్లాడుతూ తమ సంస్థ సిఎస్ఆర్ నిధుల నుంచి రూ.5 లక్షల విలువ చేసే మూడు మరుగుదొడ్ల యూనిట్లను నిర్మించామని తెలిపారు. మరో యూనిట్‌కు అవసరమైన నిధులను వెచ్చించేందుకు కృషి చేస్తానని అన్నారు. అలాగే పాఠశాల క్రీడాప్రాంగణాన్ని గ్రీనరీగా చేసేందుకు కొంత ఆర్థిక సాయాన్ని అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి. పుల్లయ్య, వార్డు కౌన్సిలర్ పాలిక కుసుమ, టిడిపి వార్డు ఇన్‌ఛార్జ్ దాట్ల శ్రీనివాసరావు, జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మరుగు దొడ్ల ప్రారంభం కార్యక్రమంలో దాతలు, విద్యార్థులు

సుంకవల్లికి ఎంఎల్ఎ జ్యోతుల పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని యల్లమిల్లి గ్రామానికి సుంకవల్లి వీర వెంకట సత్యనారాయణను ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పరామర్శించారు. సోమవారం జగ్గంపేటలో జరిగిన అన్న క్యాంటీన్ కార్యక్రమంలో పాల్గొని సుంకవల్లి తన స్వగ్రామానికి వెళ్లే క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో ఆయనను జగ్గంపేటలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎంఎల్ఎ ఆసుపత్రికి చేరుకుని ఆయనను పరామర్శించారు. మెరుగైన వైద్య అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారిశెట్టి భద్రం, ముండ్రు ఎర్రబాబు, మండపాక అప్పన్నదొర, మాదిరెడ్డి కృష్ణార్జున, మద్దిపూడి వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.



సుంకవల్లిని ఆసుపత్రిలో పరామర్శిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల

ప్రజావసరాలను తీర్చడమే బాధ్యత

ప్రజాశక్తి - కిర్లంపూడి

ప్రజల అవసరాలను తీర్చడం నా బాధ్యత అని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని సోమవరం గ్రామంలో సోమవారం గొల్లల గుంట రింగ్ రోడ్ మీదుగా వెళ్లే నూతన బస్సు సర్వీసును ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా అవసరాలను తీర్చడంలో భాగంగానే ఈ నూతన బస్సు సర్వీస్ ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సర్వీసు వల్ల సోమవరం, ఇర్రిపాక, మామిడాడ, నరేంద్ర పట్నం, కాండ్రేగుల, గొల్లలగుంట, గుర్రంపాలెం, జగ్గంపేట మీదుగా కాకినాడకు వెళ్లే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఈబస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్త రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతాం

ప్రజాశక్తి - గండేపల్లి

మల్లేపల్లి నుంచి ఎన్‌టిరాజాపురం వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో దానిస్థానే కొత్త రోడ్డును నిర్మిస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ తెలిపారు. సోమవారం ధ్వంసం అయిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు అంశాన్ని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి కొత్త రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని అన్నారు. ఈ పర్యటనలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రోగ్రాం కమిటీ కోఆర్డినేటర్ రామకుర్తి నరసింహ, మండల ప్రధాన కార్యదర్శి సింగలూరి రామ్‌దీపు, పితాని వీరబాబు, బత్తుల వెంకట రమణ,హరీష్, బలిరెడ్డి గణేష్ పాల్గొన్నారు.



కౌలు రైతు కార్డును అందిస్తున్న బాబి

కౌలుదారు కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

పి.మల్లవరం పంచాయతీ పరిధి లోని పలువురు కౌలు రైతులకు రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి దూళిపూడి వెంకటరమణ గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ, యంపిటిసి సభ్యులు నాగేంద్ర ప్రసాద్, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు గుత్తుల వెంకటరమణ, నిమ్మకాయల మూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కిర్లంపూడి ఎస్ఐగా సతీష్ నియామకం

ప్రజాశక్తి - కిర్లంపూడి

స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా జి .సతీష్‌ను సాధారణ బదిలీల్లో నియమితుల య్యారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న షేక్ జబీర్‌ను విఆర్‌కు పంపించారు. ఏలేశ్వరంలో ఎస్ఐగా పనిచేసిన సతీష్ కిర్లంపూడి ఎస్ఐగా ఒకటి, రెండు రోజుల్లోనే బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది.



మస్తర్ రికార్డును పరిశీలిస్తున్న కమిషనర్

విధులకు గైర్హాజరైతే చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ భావన హెచ్చరించారు. సోమవారం తెల్లవారుజామున ఆమె పారిశుధ్య పనుల తనిఖీల్లో భాగంగా నగరంలోని ఐదో సర్కిల్ పరిధిలోని మస్తర్‌ను పరిశీలించారు. అనంతరం ఏటిమొగ వెహికల్ యార్డ్, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఏటిమొగ వెహికల్ యార్డుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఎంహెచ్ఓ పథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా వరహాలయ్యపేట సంబరం

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలోని మరిడమ్మ జాతర సందర్భంగా వరహాలయ్య పేటలో సోమవారం సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంబరంలో ఏర్పాటుచేసిన గరగల నృత్యాలు, కాళికా నృత్యాలు, జానపద కళారూపాలు, విద్యుత్ దీపాలంకరణతో బండ్ల వేసాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ రవికుమార్, ఎస్ఐ సురేష్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేవారు. సంబరాన్ని కమిటీ సభ్యులు బైలపూడి సత్యనారాయణ, దాసరి రమేష్ కుమార్, బొడ్డు సూర్యప్రకాష్, బండారు వీరభద్రరావు, కొల్లి ప్రకాష్, బైలపూడి ప్రకాష్, కొల్లి పోతురాజు పర్యవేక్షించారు.

వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

పల్లెల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, వాటి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షుడు గుర్రపు కొత్తియ్య కోరారు. సోమవారం ఆర్‌డిఒకు ఆయన వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలు ప్రాంతాలలో కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ ప్రజలపై దాడి చేస్తున్నాయని ఆయన ఆవేదన చెందారు. ఈ క్రమంలో పలువురు గాయాల బారిన పడి ఆసుపత్రి పాలవుతున్నారన్నారు. ఆయన వెంట బిఎస్‌పి నేతలు కాండ్రేగుల గంగరాజు, నెల్లి మహేష్, విజ్జేశ్వరపు మునీంద్ర, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కొత్తియ్య

అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి-అమలాపురం

వివిధ ఐసిడిఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులకు సోమవారం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి నియామక పత్రాలు అందజేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా ఎంపికైన వీరందరూ వారం రోజుల లోపు ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని జాయింట్ కలెక్టర్ వారికి తెలిపారు.

అమెజాన్‌లో ఉద్యోగాలకు జాబ్ మేళా

ప్రజాశక్తి-అమలాపురం

ప్రముఖ కంపెనీ అమెజాన్‌లో పనిచేసేందుకు ఈ నెల 08న ఉదయం 10:30 గంటలను జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి వసంతలక్ష్మి తెలిపారు. ఈ కంపెనీలో రూ.18 వేల వరకు వేతనం ఇస్తారని తెలిపారు. 10వ తరగతి ఆపై చదివిన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి గల పురుషులు, మహిళలు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ కాపీలతో అమలాపురంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరవ్వాలని తెలిపారు. వివరాల కోసం 8121838392 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 21 ఫిర్యాదులు

ప్రజాశక్తి-అమలాపురం

పోలీసు గ్రీవెన్స్‌కు సోమవారం 21 ఫిర్యాదు అందినట్టు జిల్లా అదనపు ఎస్‌పి ఎస్.ఖాదర్ బాషా తెలిపారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించవలసిందిగా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు.'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నిర్ణీత సమయంలో నివేదికను అందించాలని అధికారులకు సూచించారు.